www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 27 ఆగస్టు 2025
5
వైఎస్ఆర్

నగరంలో పర్యటించిన కమిషనర్

ప్రజాశక్తి-కడప అర్బన్

నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మనోజ్‌రెడ్డి ఉదయం పర్యటనలో భాగంగా మంగళవారం శంకరాపురం ప్రాంతం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజలను నగరపాలక సంస్థ సేవలు ఎలా అందుతున్నాయని ఆరా తీశారు. ఆటో ప్రతి రోజు వస్తుందా లేదా అని తెలుసుకున్నారు. కాలువలు, రోడ్ల శుభ్రతపై విచారణ చేశారు. ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులతో కలిసి స్మార్ట్ స్ట్రీట్ ప్రాజెక్ట్‌లో ప్రభుత్వం మంజూరు చేసిన 100 షాపుల స్థలాల ఎంపికపై పరిశీలించారు. ఇందులో భాగంగా ఓల్డ్ రిమ్స్, నెహ్రూ పార్క్ పరిసరాలు, రాజీవ్ మార్గ్ ప్రాంతం, గాంధీ ప్లాజా వద్ద ఉన్న స్థలాలను పరిశీలించి వాటి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం కమిషనర్ సంబంధిత అధికారులను పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

ఉపాధి వనరుల ఖిల్లాగా 'కొప్పర్తి' : కలెక్టర్

ఎల్‌ఇడి మానిటర్ల తయారీని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, ఎస్‌పి

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

జిల్లాలో ప్రధాన ఉపాధి వనరుల ఖిల్లాగా కొప్పర్తి ఎపిఐఐసి మెగా ఇండస్ట్రియల్ హబ్ వెలుగొందుతోందని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు కొరత లేదని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. మంగళవారం కొప్పర్తిలోని దాదాపు 600 ఎకరాల్లో ఏర్పాటైన మెగా ఇండస్ట్రియల్ హబ్‌లో ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌ను కలెక్టర్ శ్రీధర్, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, ఎస్‌పి ఇ.జి.అశోక్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. సెప్టెంబర్ 2న రాష్ట్ర విద్యా, ఐటి శాఖా మంత్రి జిల్లాలో పర్యటించనున్న సందర్భంగా కొప్పర్తి ఇండస్ట్రియల్ పార్కులో నూతనంగా నిర్మించిన ఎగ్జిక్యూటివ్ గెస్ట్‌హౌస్‌ను, నూతనంగా ఏర్పా టైన టెక్నో డోమ్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్, రెడీమెడ్ సూట్స్ తయారు చేసే టెక్సానా ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ పరిశ్రమల్లో ప్రొడక్షన్‌ను మంత్రిచే ప్రారంభోత్సవం చేయించే యోచనలో జిల్లా యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. అధునాతన సదుపాయాలతో నిర్మితమైన ఎగ్జిక్యూటివ్ గెస్ట్‌హౌస్‌తోపాటు ఆయా పరిశ్రమల యూనిట్లను కలెక్టర్ పరిశీలించారు. మంత్రిచే ప్రారంభోత్సవం చేయడానికి తగిన ఏర్పాట్లపై ఎమ్మెల్యేతో కలిసి సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారు. అక్కడ అవసరమైన భద్రతా ఏర్పాట్లపై ఎస్‌పితో చర్చించారు. ఈ సందర్భంగా మెగా ఇండస్ట్రియల్ పార్కులో నిర్వహణలో ఉన్న ఎల్‌ఇడి మానిటర్ల ఉత్పత్తి కంపెనీ టెక్నో డోమ్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్, రెడీమెడ్ సూట్స్ తయారు చేసే టెక్సానా ఇండియా ప్రయి వేటు లిమిటెడ్ పరిశ్రమలను అక్కడి ఉత్పత్తులను పరిశీలించారు. అక్కడ తయారువుతున్న ఎల్‌ఇడి మానిటర్లు, రెడ మెడ్ సూట్‌ల నాణ్యతతో పాటు అక్కడ సిబ్బంది, సదుపాయాలు తదితర వివరా లను అడిగి తెలుసుకున్నారు. వారికి పలు సలహాలు, సూచనలు ఇస్తూ ఇక్కడ ఉత్పత్తి, ఉపాధి అవకాశాలు, సదుపాయలకు సంబంధించి ఎలాంటి అవసరాలు వున్నా తమకు తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఆ దిశగా కొప్పర్తి పారిశ్రామిక వాడను రాష్ట్రంలోనే మోడల్ ఇండ స్ట్రియల్ పార్కుగా తీర్చిదిద్దేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందన్నారు. కొప్పర్తి పారిశ్రామికవాడలో జిల్లాకే తలమానికంగా ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్ (ఇఎంసి) క్లస్టర్‌లో పరిశ్రమలు రూపు దిద్దుకుంటున్నాయన్నారు. ఎన్నో ప్రతిష్ఠాత్మకమైన కంపెనీలు కొప్పర్తి పారిశ్రామిక వాడలో రూపుదిద్దుకుంటున్నాయని పేర్కొన్నారు. జిల్లా యువతకు భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, కాంట్రాక్టర్లకు, పెట్టుబడిదారులకు మంచి అవకాశాలు పెరగనున్నాయని తెలిపారు. భవిష్యత్తులో జిల్లా పారిశ్రామికంగా మరింత అభివృద్ధిలోకి రానుందని చెప్పారు. కార్యక్రమంలో కడప ఆర్‌డిఒ జాన్ ఇర్విన్, ఎపిఐఐసి జడ్ఎం శ్రీనివాస మూర్తి, ఇండస్ట్రీస్ జిఎం చాంద్‌బాషా, చింతకొమ్మదిన్నె తహశీల్దార్ నాగేశ్వరరావు, సంబందిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

వలసల నివారణకు 'ఉక్కు' ఏర్పాటే ఏకైక మార్గం

- డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న

సమావేశంలో మాట్లాడుతున్న డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న

ప్రజాశక్తి - బద్వేలు

కడపలో ప్రభుత్వరంగ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం రాష్ట్ర వ్యాప్తంగా డివైఎఫ్ఐ పోరాటాలు ఉధృతం చేస్తామని, వెనుకబడిన రాయలసీమ లాంటి ప్రాంతంలో వలసలు నివారణకు కడప ఉక్కు పరిశ్రమ ఏకైక మార్గమని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న తెలిపారు. మంగళవారం డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశం బద్వేలులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే వెనుకబడిన రాయలసీమలో కరువు వలసలతో ఉపాధి పరిశ్రమలు లేక యువత వలసలు పోతున్నారన్నారు. వలసలు, ఆత్మహత్యల నివారణకు కడప ఉక్కు లాంటి భారీ పరిశ్రమ అవసరమని పేర్కొన్నారు. కేంద్రం ఎందుకు కడప ఉక్కుపై నోరు మెదపడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలని తెలిపారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో కడప ఉక్కుపైన ఎంపీలు మాట్లాడకపోవడం దారుణమని విమర్శించారు. కడప ఉక్కుపై రాష్ట్ర స్థాయి ఉద్యమాలు చేపడతామని చెప్పారు. జిల్లాలో సిమెంటు, సోలార్ పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. వాటిలో స్థానిక యువతకు ఉద్యోగాలు లేవన్నారు. ఇక్కడి భూమి తీసుకొని, ఇక్కడి వనరులు వాడుకొని ఇక్కడ లాభాలు సంపాధించి స్థానిక యువతకు ఉద్యోగాలు ఇవ్వడంలో ఎందుకు నిర్లక్ష్యమని, స్థానిక పరిశ్రమలో యువతకు ఉద్యోగాలు ఇవ్వకుంటే పరిశ్రమలు ముట్టడిస్తామని పేర్కొన్నారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ మాట్లాడుతూ నిర్వాసిత యువతకు ఉద్యోగాలు ఇవ్వడంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. తెలుగుగంగ, సోమశిల, గండికోట నిర్వాసిత ప్రజల వద్ద భూములు కోల్పోతే యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా మోసం చేస్తున్నారని, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, జిల్లా ప్రజాప్రతినిధులను డిమాండ్ చేస్తున్నామని పేర్కొన్నారు. కడప ఉక్కు కోసం భవిష్యత్‌లో జరిగే పోరాటాలలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బ నర్సింహులు, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కె ఆదిల్, జిల్లా కమిటీ సభ్యులు విజయ్, విశ్వనాథ్, సురేంద్ర, మస్తాన్ షరీఫ్, ఫాతిమా యువరాజ్ పాల్గొన్నారు.

దస్తగిరిని బెదిరించిన కేసులో విచారణ ప్రారంభం

కడప కేంద్ర కారాగారం

ప్రజాశక్తి - కడప

మాజీ మంత్రి వై.ఎస్.వివేకానందరెడ్డి హత్య కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరిని 2023 నవంబర్ 28న కడప జైల్‌లో బెదిరించిన ఘటనపై ప్రభుత్వం నియమించిన కమిటీ విచారణ ప్రారంభించింది. కర్నూలు ఎస్‌పి విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో కడప జిల్లా వైద్య అధికారి నాగరాజు, ఆర్‌డిఒ జాన్ ఇర్విన్, విజయవాడ జైలు అధికారి ఇర్ఫాన్ సభ్యులుగా ఉన్న కమిటీ మంగళవారం ఉదయం కడప జైలుకు చేరుకుని విచారణ చేపట్టింది. గతంలో దస్తగిరిని బెదిరించిన సమయంలో అతని బ్యారక్‌లో సిబ్బందిగా ఉన్న జైలు వార్డర్లు, జైలు అధికారులను పిలిపించి విచారించారు. అప్పటి జైలు సూపరింటెండెంట్‌గా పనిచేసిన ఐఎన్ఎస్ ప్రకాష్‌ను కూడా జైలుకు పిలిపించి ప్రశ్నించారు. జైలులో ఉన్న దస్తగిరిని వివేకా హత్య కేసులో నిందితుడుగా ఉన్న దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి కుమారుడు డాక్టర్ చైతన్యరెడ్డి జైల్లో వైద్య శిబిరం పేరిట దస్తగిరిని ప్రలోభ పెట్టి బెదిరించినట్లు రిమ్స్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. వివేకా కేసులో తమకు అనుకూలంగా సాక్ష్యం చెబితే రూ.20 కోట్లు ఇస్తానని ప్రలోభ పెట్టడమే కాకుండా మాట వినకపోతే బయటకు వచ్చిన తర్వాత చంపేస్తానని చైతన్యరెడ్డి బెదిరించినట్లు కేసు నమోదైంది. ఈ ఘటనపైన లోతుగా విచారణ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇటీవల నలుగురు సభ్యులతో నియమించిన కమిటీ మంగళవారం కడపకు వచ్చి విచారణ మొదలు పెట్టింది. నాలుగైదు రోజులపాటు విచారణ కొనసాగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాగా కడప సెంట్రల్ జైలు పూర్వ అధికారులు ప్రకాష్, జవహర్ బాబు, డాక్టర్ పుష్పలతలపై విచారణకు ఆదేశిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మెడికల్ క్యాంపుల పేరుతో ఖైదీలను బెదిరించిన ఘటనలకు బాధ్యులైన వారిపై విచారణ కమిటీని నియమిస్తూ ప్రభుత్వం జిఒ ఇచ్చింది.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు : జెడి

ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న జెడిఎ చంద్రనాయక్, అధికారులు

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ చంద్రనాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని ఎరువుల దుకాణాలను విజిలెన్స్ డిసిటి ఒ.గీతావాణి, కడప సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.వి.సురేష్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ అధికారి కృష్ణ సుమంత్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి ఈశ్వర్‌రెడ్డితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చంద్రనాయక్ మాట్లాడుతూ ఎరువులు అధిక ధరలకు అమ్మినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రయివేటు డీలర్ల వద్ద 50 మెట్రిక్ టన్నులు యూరియా ఉందని రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరలకే అమ్మాలని దుకాణదారులకు ఆదేశించారు. యూరియా ఇప్పటివరకు ఎటువంటి కొరత రాలేదని తెలిపారు. అధిక ధరలకు విక్రయించినట్లు రుజువైతే వారి లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులు రసాయనక ఎరువులను అవసరం మేరకు మాత్రమే వినియోగించాలన్నారు. అధికంగా యూరియా పంటలకు వేసినట్లయితే చీడపీడల ఉధృతి పెరుగుతుందని దీనివల్ల రైతులు దిగుబడి తగ్గి, నష్టపోతారని పేర్కొన్నారు. రైతులకు నానో యూరియా అందుబాటులో ఉందన్నారు. నానో యూరియాను పంటలకు పైపాటుగా పురుగు మందులతో కలిపి పిచికారి చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం మండలంలోని అప్పరాజుపల్లి గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో చంద్రనాయక్ పాల్గొన్నారు. రైతులతో ముఖాముఖి చర్చించి పంటల యొక్క స్థితిగతులు తెలుసుకున్నారు. చామంతి, పసుపు, పత్తి పంటలను సందర్శించి పంటలలో వచ్చే చీడపీడలు వాటి యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు.

వల్లూరు: రైతులకు ఎరువులు అమ్మేటప్పుడు ఎమ్మార్పీ ధరలకే అమ్మాలని కమలాపురం ఎడిఎ నరసింహారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వల్లూరులో సిఐ రోషన్, ఎస్ఐ పెద్ద ఓబన్న, విజిలెన్స్ అధికారి సుధాకర్ ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేశారు. ఈ తనిఖీలు యూరియా నిలువల స్థితి విక్రయ విధానం ధరల నిర్వహణ తదితర అంశాలపై విచారణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి డీలర్ యూరియాను కచ్చితంగా ఎమ్మార్పీ ధరలకే అమ్మాలన్నారు. ఎవరు ఈ నియమాన్ని ఉల్లంఘించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కిరణ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - కడప

విద్యార్థులు యువత క్షేయ వ్యాధి లక్షణాలు నివారణ పద్ధతులు గురించి తెలుసుకొని సమాజంలో అవగాహన కల్పించాలని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ అన్నారు. ప్రధానమంత్రి టిబి ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం కడప ప్రభుత్వ పురుషుల కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జి.రవీంద్రనాథ్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ విద్యార్థులు, యువత క్షయ వ్యాధి లక్షణాలు, నివారణ పద్ధతులు గురించి తెలుసుకొని సమాజంలో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. హెల్త్ డిపార్ట్మెంట్ కడప ప్రోగ్రాం అధికారి భాస్కర్ మాట్లాడుతూ క్షయ వ్యాధి సోకిన వారికి ఉచిత చికిత్స, ఔషధాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్నాయని వివరించారు. ప్రజలలో ఎటువంటి భయం లేకుండా ముందుకు వచ్చి చికిత్స పొందాలని ఆయన సూచించారు. జిల్లా కో-ఆర్డినేటర్ మహేష్ మాట్లాడుతూ విద్యార్థులు తమ కుటుంబ సభ్యులు, గ్రామాల్లో ఉన్న ప్రజలకు క్షయ వ్యాధి వ్యాప్తి, జాగ్రత్తలు గురించి తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ అంకాల నాగరాజు, రమేష్ యాదవ్, శివరామకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జ్ఞాన నైపుణ్యతలే అవకాశాలకు మార్గాలు

- వైవీయూ విసి ఆచార్య అల్లం శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కడప అర్బన్

భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టు జ్ఞాన నైపుణ్యాలను పొందినప్పుడే అవకాశాలను అందుకోగలుగుతామని యోగి వేమన విశ్వవిద్యాలయం విసి ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు ఉద్బోధించారు. రీసెంట్ అప్లికేషన్ ఆఫ్ ఫొటోనిక్ టెక్నాలజీ అనే అంశంపై ప్రత్యేక శాస్త్రీయ ఉపన్యాసం విశ్వవిద్యాలయంలోని అన్నమాచార్య సెనేట్ హాల్లో నిర్వహించారు. ఆచార్య అల్లం శ్రీనివాసరావు సైంటిఫిక్ లెక్చర్ ఇచ్చేముందు విద్యార్థుల్లో ప్రేరణ ఉపన్యాసం చేశారు. విద్యార్థులు భవిష్యత్తు కోసం ఎప్పుడూ ప్లాన్ చేసుకోవాలన్నారు. తక్కువ శ్రమ ఎక్కువ ఫలితాలు కావాలని కోరుకోవద్దన్నారు. ఆహారం, దుస్తులు వంటి ఉత్పత్తులలో నాణ్యతను చూడడం కాదని విద్యలో చూడాలన్నారు. కొంతమంది విద్యార్థులు వారి సామర్థ్యాలను కనుగొనడంలో విఫలమై కల్పిత ప్రపంచంలో నివసిస్తున్నారని, దాని నుంచి బయటికి రావాలని సూచించారు. పెరుగుతున్న పోటీకి తగ్గట్టు సన్నద్ధత కాకపోతే అనుకున్న లక్ష్యాలను చేరుకోలేరని గుర్తు చేశారు. అనంతరం రీసెంట్ అప్లికేషన్ ఆఫ్ ఫోటోనిక్ టెక్నాలజీ అనే అంశంపై ప్రత్యేక శాస్త్రీయ ఉపన్యాసం చేశారు. ప్రస్తుత ఫొటోనిక్ టెక్నాలజీ లోతైన అవగాహన ద్వారా అధునాతన క్వాంటం టెక్నాలజీని సులువుగా అర్థం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమాన్ని పర్యావరణ శాస్త్ర శాఖ సహ ఆచార్యులు డాక్టర్ టి.చంద్రశేఖర్ ఓసమన్వయం చేశారు. అనంతరం విసిని విశ్వవిద్యాలయం తరపున ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, ఆచార్య రఘునాథరెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో ఆచార్యులు, సహాయ ఆచార్యులు, విద్యార్థులు, స్కాలర్లు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఉంటాం

- కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్‌పీర్

ప్రజాశక్తి - కడప

పేద ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్‌పీర్ అన్నారు. ఇంటింటికి కాంగ్రెస్ అనే నినాదంలో భాగంగా పిసిసి అధ్యక్షులు వై.ఎస్.షర్మిల నాయకత్వంలో, డిసిసి అధ్యక్షులు విజయజ్యోతి ఆదేశాల మేరకు గౌస్ నగర్ 27వ డివిజన్‌లో ఇంటింటి కాంగ్రెస్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమవుతూ, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను, ప్రజా సంక్షేమ పథకాలను వివరించడమే కాకుండా, పార్టీ పట్ల ప్రజల్లో విశ్వాసాన్ని బలపరిచే ప్రయత్నం చేశారు. చాలా దీన స్థితిలో ఉన్న గౌస్‌నగర్ గురించి, ఇక్కడ ప్రజలు పడుతున్న రోడ్ల సమస్య, నీటి సమస్య, మురికి, కసువుతో పేరుకుపోయిన కెసి కెనాల్ సమస్య, ఇతర సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారిబాధల గురించి విని, వారికి కాంగ్రెస్ అండగా ఉంటుందని హామీ ఇచ్చామని తెలిపారు. ఈ సమస్యల పరిష్కారానికి అధికారులతో మాట్లాడి తగిన చర్యలు వెంటనే తీసుకుంటామని నమ్మకం ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌ఛార్జులు షామీర్ హుస్సేన్, హుస్సేన్, సిద్ధిక్, కరీముల్లాహ్, అంజన్ కుమార్, ఫాజులుల్లాహ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

దిక్కుతోచక వైసిపి నాయకుల విమర్శలు

- టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి

మాట్లాడుతున్న టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలన్ని అమలు చేస్తుండగా వైసిపి నేతలు దిక్కుతోచక చేస్తున్న విమర్శలను ఖండిస్తున్నామని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం ద్వారకానగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ మెగా డిఎస్‌సి ద్వారా 16,347 టీచర్ పోస్టులను పారదర్శకంగా భర్తీ చేస్తున్నామని తెలిపారు. వైసిపి హయాంలో ఒక్క డిఎస్‌సి నిర్వహించలేనే విషయాన్ని ఆ పార్టీ నేతలు గుర్తించుకోవాలన్నారు. ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించి రెండు, మూడురోజుల్లో అభ్యర్థులకు నియామక పత్రాలు అందరూ ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తూ విద్యా విధానంలో సమూల మార్పులు చేసి సంస్కరణలు తీసుకొచ్చిందన్నారు. విద్యకు సంబంధించిన నూతన ఒరవడిని తీసుకువచ్చిన ఘనత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కే దక్కిందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి హోదాలో గతంతోపాటు ప్రస్తుత పాలనలో 1,96,619 డిఎస్‌సి పోస్టులు భర్తీ చేశారన్నారు. ఇక పెన్షన్లు రూ.4, 6, 10, 15 వేలు చొప్పున పెన్షన్లు ఇస్తున్న ప్రభుత్వంగా ప్రభుత్వం చరిత్ర సృష్టించిందన్నారు. మహిళలకు సంవత్సరానికి మూడు ఉచిత సిలిండర్లు, స్త్రీ శక్తి పేరిట ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పేరిట ఒకేసారి రూ.900 కోట్లు 67 లక్షల మందికి అందజేసినట్లు పేర్కొన్నారు. ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధితో ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వం పట్ల వైసిపి నేతల వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. వైసిపి నేతలకు రిజర్వాయర్లకు నీళ్లు రావడం కూడా ఇష్టం లేదని అర్థమవుతోందన్నారు. ప్రభుత్వం చేసే తప్పును ఎత్తిచూపకుండా నిరాధరణలు ఆరోపణలు చేస్తే ప్రజలే తగిన బుద్ధిచెబుతారని హెచ్చరించారు. వినాయక చవితి పండుగ నిర్వహణలో పోలీసులు ఎలాంటి ఇబ్బందులు కలిగించరాదని ఇప్పటికే స్పష్టం చేశామన్నారు. వినాయక మండపాలకు ఉచితంగా విద్యుత్ సరఫరా అందేలా చర్యలు చేపట్టామన్నారు. ప్రజలు శాంతిభద్రతలకు ఇబ్బందులు లేకుండా ఆనందంగా పండుగను నిర్వహించుకోవాలని కోరారు. సమావేశంలో కార్పొరేటర్ సుబ్బారెడ్డి, పాలకొండ్రాయుడు దేవస్థానం చైర్మన్ రెడ్డయ్య, టిడిపి నగర ఉపాధ్యక్షులు మన్సూర్ అలీఖాన్, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు తిరుమలేష్ పాల్గొన్నారు.

పలువురు సిఐల బదిలీలు

ప్రజాశక్తి-కడప అర్బన్: జిల్లాలో పలువురు సిఐలను బదిలీచేస్తూ కర్నూల్ రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కడప రిమ్స్ సిఐగా రామకృష్ణారెడ్డి, కడప రూరల్ సిఐగా బాల మద్దిలేటిని నియమించారు. అన్నమయ్య ఎస్‌బి సిఐగా పనిచేస్తున్న తిమ్మారెడ్డి ప్రొద్దుటూరు 1 టౌన్ సిఐగా బదిలీ అయ్యారు. ప్రొద్దుటూరు వన్‌టౌన్ సిఐ రామకృష్ణారెడ్డి కడప రిమ్స్ సిఐగా బదిలీ చేశారు. కడప రిమ్స్ సిఐ సీతారామిరెడ్డి పులివెందుల అర్బన్ సిఐగా బదిలీ అయ్యారు. పులివెందుల సిఐ చాంద్‌బాషా నంద్యాల సైబర్ క్రైమ్ సిఐగా బదిలీ అయ్యారు. నంద్యాల సైబర్ క్రైమ్ సిఐగా ఉన్న వంశీధర్ ఖాజీపేట సిఐగా బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న సిఐ మోహన్‌ను కడప విఆర్‌కు అటాచ్ చేస్తూ ఆదేశాలు వెలువరించారు. రెండు రోజుల క్రితం చింతకొమ్మదిన్నె సిఐగా బాధ్యతలు చేపట్టిన నాగభూషణం ప్రొద్దుటూరు రూరల్ సిఐగా బదిలీ అయ్యారు. అక్కడ పనిచేస్తున్న సిఐ బాలమద్దిలేటిని కడప చింతకొమ్మదిన్నె సిఐగా నియమించారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో జాగ్రత్తగా ఉండాలి

ప్రజాశక్తి-కడప అర్బన్ : ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో జాగ్రత్తగా ఉండాలని ఎపి కాలుష్య నియంత్రణ మండలి కడప ప్రాంతీయ కార్యాలయం పర్యావరణ ఇంజినీర్ సుధ తెలిపారు. హుల్లాడెక్ రీసైక్లింగ్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలితో కలిసి హోటల్ మానస ఇన్‌లో ఎలక్ట్రానిక్ వ్యర్థాల (ఈ-వెస్ట్) నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యర్థాల నిర్వహణతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమన్నారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సరిగ్గా పారవేసే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని కోరారు. ముందుగా ధృవీకరించిన రీసైక్లర్లను గుర్తించాలన్నారు. వారి ద్వారా వ్యర్థాలను సక్రమంగా చానలైజ్ చేయాలన్నారు. రీసైక్లర్లు, పరిశ్రమలు, గృహాలు కలిసి పని చేసినప్పుడే స్థిరమైన వ్యర్థ నిర్వహణ వ్యవస్థను నిర్మించగలమని తెలిపారు. హుల్లాదేక్ రీసైక్లింగ్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ శ్రేయ ఖండేలియా రావత్ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు బాధ్యతాయుతమైన ఈ-వేస్ట్ నిర్వాహణ పద్ధతులను అవలంబించాల్సిన అవసరం ఉందన్నారు. వాడిన ఎలక్ట్రానిక్ పరికరాలను సరిగా నిర్వహించకపోతే అవి పర్యావరణాన్ని ధ్వంసం చేయడమే కాకుండా, వాటిలో ఉండే విషపదార్థాలు తీవ్రమైన అనారోగ్య సమస్యలను కలిగిస్తాయని తెలిపారు. సమర్థవంతమైన ఈ-వెస్ట్ నిర్వహణ కోసం వ్యక్తులు, పరిశ్రమలు, సంస్థలు కలిసి పనిచేయాలన్నారు. అవగాహన, సేకరణ, రీసైక్లింగ్ ఈ మూడు సమన్వయంతో జరిగితేనే పర్యావరణ పరిరక్షణ సాధించగలమన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌కి చెందిన శ్రీనివాసన్ మూర్తి, డిఐజి జిఎం చాంద్‌బాషా పాల్గొన్నారు.

29న తెలుగు భాషా దినోత్సవం

ప్రజాశక్తి-కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో 'వ్యావహారిక భాషా పితామహుడు' గిడుగు వెంకట రామమూర్తి 162వ జయంతి, తెలుగు భాషా దినోత్సవాన్ని 29వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమంలో 'తెలుగు భాష-గిడుగు వెంకట రామమూర్తి క ృషి' అనే అంశంపై శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ రిటైర్డ్ ఆచార్యులు ఆచార్య మేడిపల్లి రవికుమార్ ప్రసంగిస్తారని తెలిపారు.

28న అంతర్జాతీయ సమావేశం

ప్రజాశక్తి - కడప: ప్రభుత్వ పురుషుల కళాశాల జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీన సమగ్ర జీవశాస్త్రం, ఔషధ శాస్త్రంలో జరిగే పరిశోధనలు గురించి అంతర్జాతీయ సమావేశం నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ తెలిపారు. ఈ సమావేశానికి దేశ విదేశాల నుంచి శాస్త్రవేత్తలు పాల్గొంటున్నారని తెలిపారు. సమావేశానికి దాదాపు 200 పైగా పరిశోధిక వ్యాసాలును పరిశోధకులు సమర్పించారని కన్వీనర్‌గా వ్యవహరిస్తున్న జంతుశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ వీర నాగేంద్ర కుమార్ పేర్కొన్నారు. ఇండియా, మలేషియా, ఆస్ట్రేలియా నుండి శాస్త్రవేతలు ఆన్‌లైన్ విధానంలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఇటువంటి సమావేశాలకు విద్యార్థులు హాజరవడం వలన పరిశోధక రంగంపై ఆసక్తి, పరిశోధ రంగంలో ఉన్న అపారమైన ఉద్యోగ అవకాశాల గురించి అవగాహన కలుగుతుందని తెలిపారు.

వినాయక మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్ శ్రీధర్

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

వినాయక చవితి పండుగను పురస్కరించుకొని పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను పూజించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ప్రజలను కోరారు. మంగళవారం కోటిరెడ్డి సర్కిల్ వద్ద పర్యావరణ కాలుష్య నియం త్రమండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయక విగ్రహాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి విగ్రహాలతో వాయు, నీటి కాలుష్యాన్ని పూర్తిగా నివారించవచ్చన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి గణపతులను పంపిణీ చేస్తూ పర్యావరణంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిఒపితో తయారు చేసిన గణపతుల వల్ల నీటి, వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందన్నారు. నీటిలో జీవించే ప్రాణుల ఉనికికి ప్రమాదం ఏర్పడుతుందని తెలిపారు. మట్టి వినాయకులను పూజించడం వల్ల పర్యావరణ పరిరక్షణతోపాటు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవచ్చతని పేర్కొన్నారు. కార్యక్రమంలో పర్యావరణ కాలుష్య నియంత్ర మండలి అధికారులు, నగర ప్రజలు పాల్గొన్నారు.

కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

ప్రజాశక్తి-కడప అర్బన్

రాష్ట్ర వ్యాప్తంగా ఫీల్డ్ అసిస్టెంట్లపై సాగుతున్న కక్ష సాధింపు చర్యలకు స్వస్తి పలికి, విధుల నుంచి తొలగించిన వారిని తక్షణం విధుల్లోకి తీసుకోవాలని హైకోర్టు న్యాయవాది ఎం.సాల్మన్ రాజు డిమాండ్ చేశారు. మంగళవారం ప్రకాష్ నగర్‌లోని బిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా ఫీల్డ్ అసిస్టెంట్లను టార్గెట్ చేసి విధుల నుంచి తొలగిస్తున్నారని విమర్శించారు. ఎటువంటి కారణాలు చూపకుండా తప్పుడు కారణాలతో తొలగిస్తున్నారన్నారు. వారిపై ఆరోపణలు వచ్చినప్పుడు సంజాయిషీ తీసుకుని ఆధారాలు ఇచ్చిన తర్వాతే వ్యక్తిగతంగా విచారణ చేసి చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. 30 రోజుల్లో ఫీల్డ్ అసిస్టెంట్లపై వచ్చిన ఆరోపణలపై విచారణ పూర్తి చేయాల్సి ఉండగా ఎక్కడ విచారణ పూర్తిచేసిన దాఖలాలు లేవన్నారు. జిల్లాలో 78 మందిని తొలగించారని, కొంతమందిని రాజకీయ ఒత్తిడికి గురిచేసి బలవంతంగా రాజీనామాలు కూడా చేస్తున్నారని తెలిపారు. జాబ్ కార్డులు ఇచ్చే అర్హత ఫీల్డ్ అసిస్టెంట్లకు లేకున్నా జాబ్ కార్డులు ఇచ్చారన్న పేరుతో తొలగిస్తున్నారన్నారు. విధుల నుంచి తొలగించడమే లక్ష్యంగా పెట్టుకుని వేధిస్తున్నారన్నారు. తక్షణం తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఫీల్డ్ అసిస్టెంట్ అసోసియేషన్ అధ్యక్షులు గజ్జల సుదర్శన్‌రెడ్డి, కార్యదర్శి కె.బయ్యపురెడ్డి, గౌరవ అధ్యక్షులు జాలాశివ, గంగాధర్, సుబ్బరాయుడు, ఓబయ్య పాల్గొన్నారు.

అభివాదం చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

ప్రాథమిక పాఠశాలకు కంప్యూటర్ వితరణ చేస్తున్న దాత బ్రహ్మారెడ్డి

కంప్యూటర్, ప్రింటర్, సౌండ్ సిస్టం వితరణ

ప్రజాశక్తి - తొండూరు

అగడూరు మోడల్ ప్రాథమిక పాఠశాలకు విద్యా సదుపాయాలు మెరుగుపరిచే ఉద్దేశంతో అదే గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి అలవలపాటి బ్రహ్మారెడ్డి కంప్యూటర్, ప్రింటర్, సౌండ్ సిస్టమ్, ఆగడూరు హైస్కూలుకు దాదాపు రూ.20 వేలు విలువ చేసే సైన్స్ మెటీరియల్ వితరణ చేశారు. అమెరికాలో స్థిరపడిన బ్రహ్మారెడ్డి తన సొంత ఊరు రుణం తీర్చుకోవాలనే సంకల్పంతో తన వంతు పాఠశాలల అభివృద్ధికి తోడ్పడుతున్నారు. పాఠశాల సిబ్బంది ఆయనకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాబురెడ్డి, లెక్చరర్ టీచర్ రాజా, ఎంపిపిఎస్ ప్రధానోపాధ్యాయులు బాలకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిఎంకు తులసిరెడ్డి బహిరంగ లేఖ

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె గ్రామ పంచాయతీ దుస్థితిపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్‌కు మంగళవారం పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి బహిరంగ లేఖ రాశారు. స్వర్ణాంధ్ర, స్వర్ణాంధ్ర, ఆరోగ్య ఆంధ్ర, ఆనంద ఆంధ్ర కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని, కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు పూర్తిగా విరుద్ధంగా ఉన్నట్లు లేఖలో పేర్కొన్నారు. మురికి ఆంధ్ర, అనారోగ్యాంధ్ర అన్నట్లు ఉందన్నారు. పులివెందుల నియోజకవర్గంలోని వేంపల్లె గ్రామపంచాయతీ దుస్థితి ఇందుకు నిదర్శనమని ఆయన తెలిపారు. వేంపల్లెపై ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ప్రత్యేకదృష్టి పెట్టి వెంటనే సమర్థవైన రెగ్యులర్ ఇఒను నియమించాలని కోరారు. పారిశుధ్య, నీటి సరఫరా సిబ్బందికి బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. వారికి నెలనెలా జీతాలు సకాలంలో చెల్లించాలని కోరారు. సంపద కేంద్రాన్ని వెంటనే వినియోగంలోకి తేవాలన్నారు. అర్ధాంతరంగా మధ్యలో నిలిచిపోయిన భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తి చేయాలని సూచించారు. రోడ్ల విస్తరణ పనులు కూడా చేపట్టాలన్నారు. ముఖ్యమంత్రికి పంపిన లేఖను కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మికి కూడా పంపినట్లు తులసిరెడ్డి తెలిపారు.

కేక్ కట్ చేస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

ఘనంగా ఎంపీ అవినాష్ ముందస్తు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల ఎర్రగుడి పాలెంలో వైసిపి నాయకులు కోళ్ల భాస్కర్, మూర్తి, చంద్రమౌళి, ఇతర నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ముందస్తు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. నాయకులు ఏర్పాటు చేసిన కేకును మున్సిపాలిటీ వైస్ ఛైర్మన్ వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ చిన్నప్ప కట్ చేసి అక్కడ ఉన్నవారికి పంచిపెట్టారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని వైఎస్ మనోహర్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు హాల్ గంగాధర్‌రెడ్డి, నాలుగో వార్డ్ కౌన్సిలర్ వనజల్ల కిషోర్, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ సర్వోత్తమరెడ్డి, సూరి, రవికుమార్, ఖాదర్ బాషా, తమ్మిశెట్టి హరి, రాజేష్ పాల్గొన్నారు.

పులివెందుల అర్బన్ సిఐగా సీతారామిరెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల అర్బన్ సిఐగా సీతారామిరెడ్డిని బదిలీ చేస్తూ మంగళవారం కర్నూల్ రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. పులివెందుల అర్బన్ సిఐగా పనిచేస్తున్న చాంద్‌బాషాను నంద్యాల సైబర్‌క్రైమ్ సిఐగా బదిలీ చేశారు. కడప రిమ్స్ సిఐగా పనిచేస్తున్న సీతారామిరెడ్డిని పులివెందుల అర్బన్ సిఐగా బదిలీ చేశారు. ఆయన 2019లో పులివెందుల అర్బన్ సిఐగా పనిచేశారు. అప్పట్లో ఆయనపై కొన్ని ఆరోపణలు రావడంతో కడప వీఆర్‌కు బదిలీ చేశారు. అనంతరం ఆయన వేంపల్లెలో సిఐగా పని చేశారు. వేంపల్లెలో కూడా ఆయనపై ఆరోపణలు రావడంతో కడప ట్రాఫిక్ సిఐగా బదిలీ చేశారు. కడప రిమ్స్ సిఐగా పనిచేస్తూ బదిలీపై పులివెందుల అర్బన్ సిఐగా వచ్చారు. త్వరలో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

వేషధారణలో ఉన్న విద్యార్థులతో చక్రపాణిరెడ్డి

చైతన్య పాఠశాలలో ముందస్తు వినాయక చవితి

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక చైతన్య పాఠశాలలో ముందస్తు వినాయక చవితి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వినాయకుడి వేషధారణలో పాఠశాలకు విచ్చేశారు. విద్యార్థులు రూపొందించిన మట్టి విగ్రహాలను ప్రదర్శించారు. ముందస్తు వేడుకల సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు చురుగ్గా పాల్గొన్నారు. చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి, శాస్త్రీయ నృత్యాలు, వినాయకుడిపై ప్రత్యేక పాటల కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి మట్టి విగ్రహాలను తయారు చేసిన విద్యార్థులను ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు చైతన్యరెడ్డి, చేతన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాగార్జున మోడల్ స్కూల్‌లో..

కడప అర్బన్ : కడప నగరంలోని మారుతీ నగర్‌లో ఉన్న నాగార్జున మోడల్ స్కూల్లో మంగళవారం వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యా సంస్థల ఛైర్మన్ ఎం.శివశంకర్‌రెడ్డి, డైరెక్టర్ ఎం.జ్ఞాన విద్యార్థులకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎం.శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ భారతదేశం వివిధ సాంస్కృతిక సంప్రదాయాలకు నిలయమన్నారు. వినాయకుని మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజ అనంతరం పాఠశాల ఆవరణలోనే నిమజ్జనం చేశారు. విద్యార్థులు ఘనంగా పూజలు ప్రతి ఒక్కరికి పంచిపెట్టారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, బోధన, సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకల్లో విద్యార్థులు, స్కూల్ యాజమాన్యం

ఆక్రమణలు జరిగివుంటే విచారిస్తాం : కలెక్టర్

ఆలయ భూముల మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని పోట్లదుర్తి గ్రామంలో ఉన్న శ్రీపెద్దమ్మతల్లి దేవస్థానానికి సంబంధించి ఆలయ భూములను కలెక్టర్ చెరుకూరు శ్రీధర్, ఎస్పీ అశోక్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. గత కొన్ని రోజులుగా దేవాలయ ప్రాంగణంలో కొంత భాగం మేర ప్రహరీ నిర్మించేందుకు ప్రయత్నాలు జరుగుతున్న నేపథ్యంలో స్థానికులు అడ్డుకుంటున్నారు. ఆలయ భూమి మొత్తానికి ప్రహరీ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ, పోలీస్ అధికారులు ఆలయ భూములను పరిశీలించారు. ఆలయానికి రికార్డుల ప్రకారం ఎంత భూమి ఉంది అనే దానిపై ఎండోమెంట్, రెవెన్యూ శాఖల అధికారుల రికార్డులను, మ్యాపులను పరిశీలించారు. కలెక్టర్ స్వయంగా ఈ భూముల హద్దులను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అభివృద్ధికి సంయుక్తంగా కృషి చేయాల్సి ఉందన్నారు. ఆక్రమణలు జరిగి ఉంటే విచారిస్తామన్నారు. ఆలయ అభివృద్ధికి నిధులను మంజూరు చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎండోమెంట్ శాఖ డైరెక్టర్ మల్లికార్జున, జమ్మలమడుగు ఆర్డిఓ సాయిశ్రీ, తహశీల్దార్ శోభన్ బాబు, జమ్మలమడుగు డిఎస్పి వెంకటేశ్వరరావు, సీఐలు విశ్వనాథరెడ్డి, దస్తగిరి, ఎస్ఐ నాగమురళి, టిడిపి రాష్ట్ర నాయకులు సురేష్ నాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోట్లదుర్తి గ్రామంలో పర్యటిస్తున్న కలెక్టర్, ఎస్‌పి

అభివృద్ధిపై విచారణ కమిటీని నియమించాలి

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జి.శివకుమార్

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

బ్రహ్మంగారిమఠం పుణ్యక్షేత్రంలో దేవాలయం పరిధిలో నాలుగేళ్లుగా జరిగిన అభివృద్ధి పనులలో నిన్నటి వరకు ఫిట్ పర్సన్‌గా వ్యవహరించిన శంకర్ బాలాజీ పెద్ద ఎత్తున అవినీతికి, అధికార దుర్వినియోగానికి పాల్పడ్డాడని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.శివ కుమార్ తెలిపారు. తక్షణమే ఉన్నతస్థాయి అధికారులు స్పందించి నిజాయితీ గల రిటైర్డ్ దేవాదాయ శాఖ అధికారులతో విచారణ కమిటీని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆ మేరకు మంగళవారం ఆయన సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బ్రహ్మంగారి గుడికి అనుసంధానంగా ఉన్న పోలేరమ్మ గుడి, బ్రహ్మంగారి ఇళ్లు మొదలైన చోట్ల అభివృద్ధి పేరుతో పనులు చేయించాడని సిపిఎంగా ఇందుకు స్వాగతిస్తున్నామన్నారు. దాదాపు రూ.7 కోట్లతో జరిగిన పనులలో బ్రహ్మంగారి గుడికి ఉత్తరం వైపున ప్రహరీ, కల్యాణ మండపం, కళ్యాణకట్ట, గోకులం, యాత్రికుల వసతిగృహాలు, బ్రహ్మంగారి ఇంటి ప్రహరీ, పోలేరమ్మ గుడి ప్రహరీ ప్రాంగణం, షాపింగ్ కాంప్లెక్స్ మొదలైన పనులు కాంట్రాక్టు ద్వారా చేయించాడని, ఇందులో పెద్ద ఎత్తున అధికార దుర్వినియోగానికి, అవినీతికి శంకర్ బాలాజీ పాల్పడ్డాడని ఆరోపించారు. సమావేశంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు గోవిందస్వామి, హరి, ప్రసాద్, రెబ్బా నరసింహులు, చిన్నప్ప పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ట్రిపుల్‌ఐటి విద్యార్థులు

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రస్థాయిలో జరిగే యోగా పోటీలకు ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి విద్యార్థులు ఎంపికైనట్లు ఆర్కేవ్యాలీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా తెలిపారు. యోగాలో రాణించిన విద్యార్థులను మంగళవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా కుమారస్వామి గుప్తా మాట్లాడుతూ వేంపల్లెలోని ఒక ప్రయివేటు పాఠశాలలో యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కడప జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా పోటీల్లో తమ యూనివర్సిటీ విద్యార్థులు ప్రతిభ చూపారన్నారు. 20 పతకాలు కైవసం చేసుకున్నారని తెలిపారు. వీటిలో 6 బంగారు, 5 వెండి, 5 రాగి పతకాలతోపాటు 4 మెరిట్ స్థానాలు సాధించడం విశేషమన్నారు. 16 నుంచి 22 ఏళ్లలోపు వయసు విభాగాల్లో బాలబాలికల విభాగాల వారీగా నిర్వహించిన ఈ ఎంపిక పోటీలో ఆర్కేవ్యాలీ విద్యార్థుల ప్రతిభ ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని ప్రశంసించారు. సెప్టెంబర్ 6,7 తేదీల్లో తూర్పుగోదావరి జిల్లా ద్వారక తిరుమలలో జరగబోయే 50వ రాష్ట్రస్థాయి యోగా పోటీలకు హాజరవుతారని వివరించారు. ఆర్కేవ్యాలీ విద్యార్థుల ప్రదర్శన జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో కూడా మరిన్ని విజయాలు సాధిస్తారని తనకు విశ్వాసం ఉందన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులతో ఆర్కేవ్యాలీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా

రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు

ఎరువుల అమ్మకాలపై నిఘా : ఎస్‌పి

ప్రజాశక్తి - మైదుకూరు రూరల్

అధిక ధరలకు ఎరువుల అమ్మకాలపై నిఘా ఉంచామని, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అడిషనల్ ఎస్పీ జి.శ్రీనివాసరావు హెచ్చరించారు. జిల్లాలో ఎరువుల బ్లాక్ మార్కెటింగ్, అధిక ధరలకు విక్రయాలపై అడిషనల్ ఎస్పీ జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు, వ్యవసాయ అధికారులు దాడులు నిర్వహించారు. కలెక్టర్, రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ఆదేశాల మేరకు మండలంలోని జీవి సత్రంలో మంగళవారం తనిఖీలు చేపట్టారు. శ్రీశక్తి ట్రేడర్స్, శ్రీలక్ష్మీ నరసింహ పెస్టిసైడ్స్ అండ్ ఫెర్టిలైజర్స్, మన గ్రోమోర్ సెంటర్, శ్రీకీర్తన ఆగ్రో ఏజెన్సీ షాపులను తనిఖీ చేశారు. అనంతరం అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు ఎరువుల డీలర్లకు పలు సూచనలు చేశారు. జిల్లాలో యూరియా నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, రైతులు ఆందోళన చెందవద్దని తెలిపారు. తనిఖీలో మైదుకూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.కృష్ణమూర్తి, విజిలెన్స్ సీఐ ఎం.శివన్న, స్థానిక సీఐ రమణారెడ్డి, ఎఒ బాల గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

అవసరం మేరకు యూరియా ఉపయోగించాలి

చాపాడు : రైతులు అవసరం మేరకు మాత్రమే యూరియాను ఉపయోగించాలని ఎఒ దేవి పద్మలత తెలిపారు. మంగళవారం మండలంలోని వెంగన్నగారిపల్లె, చిన్న వరదాయపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికంగా యూరియా వాడడం వలన భూమిలో నత్రజని శాతం పెరుగుతుందన్నారు. వరి పంటలో పాటించాల్సిన మెలకువలను రైతులకు వివరించారు. కాలిబాటలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విఎఎ చిట్టిబాబు, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిధులు స్వాహాపై విచారణ చేపట్టాలి : సమావేశంలో సభ్యులు

ప్రజాశక్తి - లింగాల

15వ ఆర్థిక ప్రణాళిక కింద ప్రభుత్వం మంజూరు చేసిన రూ.77 లక్షల నిధులతో ఏ విధమైన పనులు చేయకుండా అధికారులు బిల్లులు డ్రా చేసుకుని, ఆ సొమ్మును అంతా స్వాహా చేశారని, ఇందుకు అప్పటి ఎంపిడిఒ సురేంద్రనాథ్, జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్ ప్రస్తుత ఎఒ లోకేష్ అని ఎంపిపి రమాదేవి, ఎంపిటిసి సభ్యులు ఆరోపించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ భవనంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో వారు మాటాడుతూ.. నిధులు స్వాహాపై కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జెడ్పీ సిఈఓ ఓబుళమ్మలకు ఫిర్యాదు చేశారని, ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. నిధులు పక్కదారి పట్టడంతో మండలంలోని పలు గ్రామ పంచాయితీల్లో సమస్యలు తిష్ట వేసి ఉన్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విచారణ చేపట్టకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. పలు శాఖల అధికారులు గైర్హాజరుపై ఎంపిపి ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం వివిధ సమస్యలపై ఎంపిపి చర్చించారు. కార్యక్రమంలో జడ్పీటిసి పుష్ప, ఎంపిడిఓ శ్రీనివాసరెడ్డి, తహశీల్దార్ ఈశ్వరయ్య, మండల వైద్యాధికారి ప్రసన్నకుమార్, పంచాయితీరాజ్ ఏఈ మనోహరరెడ్డి పాల్గొన్నారు.

మహామనిషి మదర్ థెరిసా

ప్రజాశక్తి - వేంపల్లె

మానవత్వం పరిమళించిన మహామనిషి మదర్ థెరిసా అని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి కొనియాడారు. మంగళవారం మదర్ థెరిస్సా 115 జయంతిని పురస్కరించుకుని కాంగ్రెస్ నాయకులు వేంపల్లెలో ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ మానవసేవయే మాధవసేవగా భావించిన మహోన్నత మానవతా మూర్తి మదర్ థెరిస్సా అన్నారు. ప్రార్థించే పెదాల కన్నా సేవ చేసే చేతులు మిన్న అని మదర్ థెరిస్సా నిరూపించారని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గపు సమన్వయకర్త ధ్రువకుమారెరెడ్డి, వేంపల్లె, చక్రాయపేట, వేముల మండల శాఖ అధ్యక్షులు రామకృష్ణ, అధ్యక్షులు రామాంజనేయరెడ్డి, వెంకటేశు, అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, నాగరాజు, ఐచర్ రమణ పాల్గొన్నారు

కడప :మదర్ థెరిస్సా సేవలు మరువలేమని సరిగమ ఆర్కెస్ట్రా అధినేత, ప్రముఖ గాయకులు బాషా పేర్కొన్నారు. మదర్ థెరిస్సా 115వ జయంతి సందర్భంగా ఆర్కే రాయల్ కరీం సేవా సమితి ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ముస్లిం ఫోరమ్ రాష్ట్ర కార్యదర్శి రఫిక్ ఖాన్, ఆర్కే సేవా సమితి అధ్యక్షులు అబ్దుల్లా షేక్, రాయల్ కరీముల్లా, బాబు, రవి, మహారాజ్ పాల్గొన్నారు.

పరీక్షల నియంత్రణాధికారిగా అరుణ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటిలో పనిచేస్తున్న డాక్టర్ వై.అరుణ్‌కుమార్‌రెడ్డిని నూతన కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్‌గా ఆర్జీయూకేటీ అధికారులు నియమించారు. ఎంఎంఇ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ జి.రమేష్‌ను ఆర్కేవ్యాలీ క్యాంపస్ నూతన ఆర్థిక అధికారిగా నియమించారు. వారు మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. వై.అరుణ్‌కుమార్‌రెడ్డి గతంలో ఇసిఇ విభాగంలో హెచ్‌ఓడి, అసోసియేట్ డీన్స్ ఆఫ్ అకాడమిక్‌గా పని చేశారు. జి.రమేష్ గతంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, డీన్ అకడమిక్, స్టోరేజ్ అండ్ పర్చేస్ కో-ఆర్డినేటర్, ఎంఎంఇ హెచ్‌ఓడిగా పని చేశారు. వీరిని ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్, డీన్ రమేష్ కైలాష్ అభినందించారు.

వికలాంగులకు గృహోపకరణాలు వితరణ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

విశ్వమాత మదర్ థెరిస్సా 115వ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఉన్న వికలాంగుల కమ్యూనిటీ భవనంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జేఎన్‌టియు కళాశాల ప్రిన్సిపల్ విష్ణువర్ధన్, కళాశాల ఆంగ్ల విభాగాధిపతి, హెల్పింగ్ హ్యాండ్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ సాంబయ్య, ప్రముఖ సంఘ సేవకులు నక్కలపల్లి కొండారెడ్డి మదర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం హెల్పింగ్ హ్యాండ్స్ విద్యార్థి సేవావిభాగం సమకూర్చిన గృహోపకరణాలను 30మంది వికలాంగులకు అందజేశారు. కార్యక్రమంలో నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, జేఎన్‌టియు హెల్పింగ్ హాండ్స్ సేవా విభాగం విద్యార్థులు పాల్గొన్నారు.

నేషనల్ హైవే రోడ్డు సర్వే సమాచారం ఇవ్వండి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ముద్దనూరు నుంచి సత్యసాయి జిల్లాలోని గోరంట్ల వరకు నిర్మిస్తున్న నేషనల్ హైవే 716 జి రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించి సర్వే కొనసాగుతోంది. నేషనల్ హైవే అధికారులు ఒకవైపు సర్వే చేస్తున్నారు.. మరొకవైపు స్థానిక రెవెన్యూ అధికారులు కూడా సర్వే చేస్తున్నారని, దీనికి సంబంధించి మున్సిపాలిటీ పరిధిలో కూడా సర్వేలు చేస్తున్నారని, భూ యజమానులకు కానీ సమాచారం ఇవ్వలేదని కౌన్సిలర్లు ఆరోపించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ నేషనల్ హైవే అధికారులు కానీ ఇటు స్థానిక రెవెన్యూ అధికారులు కానీ గుట్టుచప్పుడు కాకుండా సర్వే పనులు చేస్తున్నారన్నారు. వాస్తవానికి నేషనల్ హైవే రోడ్డు నిర్మాణాలు గ్రామాలు లేని ప్రాంతాల్లో 36 మీటర్లుగా, గ్రామాలు, పట్టణాలు ఉన్న ప్రాంతాలలో 26 మీటర్లుగా ఖరారు చేసి సర్వే చేస్తున్నారని తెలిపారు. అయితే పులివెందులలో మాత్రం ఇందుకు విరుద్ధంగా సర్వే పనులు చేస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో ఒక్కో అంశంపై చర్చించి ఆమోదించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

వైష్ణవి హత్య కేసు నిందితులు కోర్టుకు హాజరు

- నార్కో అనాలసిస్ టెస్ట్‌కు కోర్టు అనుమతి కోరిన పోలీసులు

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్ : పర్యాటక ప్రాంతమైన గండికోటలో గత నెల 14న వైష్ణవి అనే ఇంటర్ విద్యార్థిని హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ హత్య కేసు పక్కా ఆధారాల కోసం పోలీసులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. కేసు విచారణలో ఉండగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జమ్మలమడుగుకు పింఛన్ల పంపిణీకి రావడంతో కేసు కాస్త అటకెక్కింది. అనంతరం మీడియా నుండి ఒత్తిడి రావడం పలు కథనాలు ప్రసారం కావడంతో పోలీసులు విద్యార్థిని వైష్ణవి కుటుంబ సభ్యులను విచారణ జరిపించాలని కోర్టును ఆశ్రయించారు. మంగళ వారం వైష్ణవి కుటుంబ సభ్యులు ఇద్దరు, మరో వ్యక్తి లోకేష్ ముగ్గురిని నార్కో అనాలసిస్ టెస్ట్ కోసం కోర్టు అనుమతి కోసం పోలీసులు జమ్మలమడుగు కోర్టులో హాజరు పరచారు. ఓపక్క వైష్ణవి కుటుంబ సభ్యులైన సురేంద్ర, కొండ య్య, అనే వ్యక్తులను విచారిస్తూ వైష్ణవి ప్రియుడని చెప్పుకునే లోకేష్‌ను కూడా పోలీసులు విచారిస్తూ కోర్టుకు తెచ్చారు. అనంతరం చాలా గోప్యంగా కోర్టులో ఏమి జరిగిందనేది బయటికి రానీయకుండా పోలీసులు, అటు కోర్టు వారు చర్యలు తీసుకున్నారు. నార్కో అనాలసిస్ టెస్ట్‌పై పోలీసుల నుండి సమాచారం తెలియాల్సి ఉంది. ముగ్గురూ నిందితులు ప్రొద్దుటూరు పట్టణం సార్వకట్ట వీధికి చెందిన వారు. నెలన్నర కిందట జరిగిన విద్యార్థిని హత్య కేసును ఛేదించడానికి పాలిగ్రాఫ్ పరీక్ష చేయించడానికి విద్యార్థిని ముగ్గురు కుటుంబ సభ్యులు హాజరై తమ అంగీకారాన్ని తెలిపినట్లు సమాచారం. త్వరలో ఆ ముగ్గురిని హైదరాబాదుకు తీసుకెళ్లి పాలిగ్రాఫ్ పరీక్ష చేయించే అవకాశం ఉంది.

చెత్త నుంచి సంపద సృష్టించొచ్చు

ప్రజాశక్తి - ముద్దనూరు : రోడ్లపైన ఇంటింటికీ తిరిగి సేకరించిన చెత్త, వ్యర్థాల నుంచి సంపద సృష్టించవచ్చని స్వచ్ఛ భారత్ మిషన్ కేంద్ర బృందం సభ్యులు ప్రసాద్ పేర్కొన్నారు. మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని డిఎన్ పల్లె సమీపంలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని మంగళవారం ఎంపిడిఒ పరిపూర్ణ అరుంధతి, ప్రసాద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ గ్రామ, పట్టణాలు స్వచ్ఛంగా ఉండాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమం చేపట్టిందన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ పదేళ్లు పూర్తయిన సందర్భంగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు లక్ష్మీ నరసింహులు, కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలు మంచిది

ప్రజాశక్తి - వేంపల్లె : పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక విగ్రహాలను ప్రతి ఒక్కరూ వినియోగించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నాగేంద్ర సూచించారు. వినాయక చవితి పండుగను పురస్కరించుకుని మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను ఉపయోగించడం వల్ల నీటి, వాయు కాలుష్యాలు ఎక్కువ అవుతాయన్నారు. అనంతరం 60 విగ్రహాలను సమీప ప్రజలకు, విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్నేహిత అమృత హస్తం అధ్యక్షులు మేమ్మల రాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.ఓబుల్‌రెడ్డి, డాక్టర్ సి.మల్లేశ్వరమ్మ, అధ్యాపకులు కిరణ్మయి, నాగలక్ష్మిదేవి, శ్రీకాంత్‌రెడ్డి, షఫీద్దీన్, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చెన్నూరు : ప్రతి ఒక్కరూ మట్టి గణపతి విగ్రహాలను మాత్రమే ప్రతిష్ఠించాలని, పర్యావరణానికి శ్రేయస్కరమని ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్ కోరారు. వినాయక పూజలు, నిమజ్జనం సందర్భాల్లో ఉత్సవ కమిటీ తగ జాగ్రత్తలు తీసు కోవాలని సూచించారు. **కడప :** కడప నగరంలోని 23వ డివిజన్ కార్పొరేటర్ ఐస్ క్రీమ్ రవి ఆధ్వర్యంలో మంగళవారం వినాయకుని మట్టి విగ్రహాలను మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, నగర మేయర్ సురేష్ బాబు పంపిణీ చేశారు. మట్టి విగ్రహాల ద్వారా పర్యావరణాన్ని రక్షించుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహిం చామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శ్రీలేఖరెడ్డి ప్రసాద్, రామకృష్ణారెడ్డి, మహమ్మద్ షఫీ, మల్లికార్జున, కిరణ్, శ్రీరంజన్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యురాలు మరియు, జిల్లా మహిళా అధ్యక్షురాలు టిపి వెంకటసుబ్బమ్మ, జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి శివప్రసాద్, శ్యాం ప్రదీప్ పాల్గొన్నారు.

మట్టి వినాయకుడిని పూజిస్తూ పర్యావరణాన్ని కాపాడుదామని వికాస్ కాలేజీల సంస్థ కరస్పాండెంట్ సుల్తాన్ బాబా పేర్కొన్నారు. నాగరాజుపేట రామాలయం వద్ద వినాయకుడి ఉచిత మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ప్రతిఏటా నాగరాజుపేట యూత్ ఆధ్వర్యంలో కులమతాలకు అతీతంగా వినాయక చవితి వేడుకలను నిర్వహించుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో కోదండ రామాలయం కమిటీ చైర్మన్ కె.వి.శ్రీహర్ష, కార్యవర్గ సభ్యులు నిత్యానంద, కిరణ్‌కుమార్ బాబు, నారాయణ, అయ్యప్ప, లక్ష్మీనారాయణ, బాలాజీ, మారుతి, బుజ్జి, సతీష్, వెంకటసుబ్బయ్య, రమణ, సూరి, కుమార్, నరసయ్య, హరికుమార్ పాల్గొన్నారు. **చాపాడు (మైదుకూరు) :** మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి అధ్యక్షతన ఎన్ఎస్ఎస్, వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయకుని పూజిద్దాం అనే అవగాహన సదస్సు నిర్వహించారు. అధ్యాపకులు డాక్టర్ పి.వి.కృష్ణారెడ్డి, రాధా రామ్, సుభాన్‌సాహెబ్, అనురాధ, లక్ష్మి, అయ్యవారురెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** పట్టణంలో పర్యావరణ ప్రేమికులు ఉచితంగా మట్టి గణపతులను ప్రజలకు వితరణ చేశారు. మంగళవారం సాయంత్రం స్థానిక పాత బస్టాండ్‌లో నవాజ్ కట్ట సచివాలయంలో పనిచేసే వార్డు శానిటేషన్, పర్యావరణ సెక్రెటరీ వెంకటేశ్వర్లు మట్టి గణనాథులను పంపిణీ చేశారు.

ప్రశాంతంగా వినాయక ఉత్సవాలు నిర్వహించాలి

ప్రజాశక్తి - మైదుకూరు రూరల్: వినాయక చవితి వేడుకల సందర్భంగా వినాయక ఉత్సవ కమి టీలు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని మైదుకూరు డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్ సూచించారు. సబ్ డివిజన్ పరిధిలోని ప్రజలు ఎలాంటి గొడవలు లేకుండా శాంతియుతంగా పండుగ జరుపుకోవాలని ఆయన కోరారు. విగ్రహం వద్ద కమిటీ సభ్యులు 24 గంటలు అందుబాటులో భద్రతను పర్యవేక్షించాలన్నారు. అసభ్యకర ప్రదర్శనలు, పాటలను పూర్తిగా నిషేధిస్తున్నామని తెలిపారు. నిమజ్జనం సమయంలో మద్యం సేవించవద్దన్నారు.

పంట నమోదు తప్పనిసరి

పులివెందుల రూరల్ : మండలంలోని ఇ కొత్తపల్లి గ్రామంలో ఎఒ వి.చెన్నారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంట నమోదు తప్పనిసరి అని ఎఒ రైతులకు సూచించారు. పంట నమోదు చేయించుకున్న రైతులకు మాత్రమే వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేసే పథకాలు వర్తిస్తాయని తెలిపారు. రైతులు డ్రోన్ టెక్నాలజీ ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ ఎకరాలకు పురుగు మందులు పిచికారి చేసుకోవచ్చన్నారు. ఖర్చులు తగ్గుతాయని ఆయన తెలిపారు. క్రాప్ ఇన్సూరెన్సు గడువు ఈ నెల 30 వరకు పొడిగించారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌కె ఇన్‌ఛార్జి ఇంతియాజ్, వ్యవసాయ విస్తరణ అధికారి రమణారెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ప్రమాదవశాత్తూ బ్రహ్మసాగర్‌లో పడి మహిళ మృతి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం: బ్రహ్మసాగర్ ప్రాజెక్టులో ప్రమాదవశాత్తూ పడి మడక లక్ష్మీదేవి (35) అనే మహిళ మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ శివప్రసాద్ తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని విచారిస్తున్నారు. ఎస్ఐ సమాచారం మేరకు నరసన్నపల్లె గ్రామానికి చెందిన మడక రమణయ్య తెలుగుగంగ రోడ్డులోని ఇండియన్ పెట్రోల్ బంకులో బాయ్‌గా పని చేస్తూ జీవనం సాగి స్తున్నాడు. లక్ష్మీదేవి చేనేత పని చేసేది. దైవచింతన ఎక్కువగా ఉండి వారంలో ఒకసారి బ్రహ్మసాగర్‌లో స్నానం చేసి గుడికి వెళ్లేది. ఆ క్రమంలో మంగళవారం తెల్లవారు జామున మృతురాలు లక్ష్మీదేవి తన కుమారుడు స్వరూప్‌ను వెంటబెట్టుకొని బ్రహ్మంగారి గుడికి వెళుతున్నానని చెప్పి ఇంటి వద్ద నుండి వెళ్లింది. బ్రహ్మసాగర్‌లో స్నానం చేస్తూ ప్రమాదవశాత్తూ నీళ్లలో పడి మునిగిపోయింది. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం బద్వేలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త రమణయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బ్రహ్మసాగర్‌లో మృతదేహాన్ని వెలికి తీస్తున్న పోలీసులు